క్లుప్తంగా

శాంతి భద్రతలే లక్ష్యం

కొత్తగూడెంఅర్బన్: శాంతి భద్రతల పరిరక్షణలో ఎవరిని ఉపేక్షించకూడదని డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ ఆదేశించారు. వార్షిక తనిఖీలో భాగంగా శుక్రవారం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. పెండింగ్ కేసులను కోర్టు కేసులను సత్వరంగా పరిష్కరించాలని సూచించారు.

పాఠశాలలో డ్రైడే - ఫ్రైడే

టేకులపల్లి: కోయగూడెంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం డ్రైడే - ఫ్రైడే నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల, వసతి గృహం ఆవరణలో చెత్తను తొలగించారు. హెచ్ఎం అమర్ సింగ్, డిప్యూటీ వార్డెన్ నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఇల్లెందురూరల్: రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ అన్నారు. పీఏసీఎస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేసిందని, ఇందులో భాగంగా ఇల్లెందు పీఏసీఎస్ పరిధిలో 1.58 కోట్ల మేర రైతులకు రుణమాఫీ జరిగిందన్నారు. త్వరలో రైతు భరోసాను కూడా అమలు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందన్నారు.

'ఉద్దీపనం'తో మేలు

ఇల్లెందురూరల్: ఐటీడీఏ రూపొందించిన ఉద్దీపనం పుస్తకం ప్రాథమిక విద్యార్థుకు మేలు చేస్తుందని చెన్నంగులగడ్డ ఆశ్రమ పాఠశాల హెచ్ఎం నామనాయక్ అన్నారు. శుక్రవారం పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థులకు ఉద్దీపనం పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ పుస్తకాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకొని ఉజ్వల భవిష్యత్‌కు మంచి పునాదులు వేసుకోవాలని సూచించారు.

ఉచిత కంటి వైద్యపరీక్షలు

ఇల్లెందు: సీపీఎం జిల్లా మహాసభల విజయవంతంలో భాగంగా ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఉచిత కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఏలూరి భవన్‌లో ఏర్పాటు చేసిన శరత్ మాక్స్ విజన్ వారి సౌజన్యంలో పేదలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు.

సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలి

ఇల్లెందు: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ మాల మహానాడు నేతలు బహిరంగ సభ నిర్వహించటం గర్హనీయమని టీఎంఆర్‌పీఎస్ నాయకుడు మేకల శ్యాం అన్నారు. శుక్రవారం ఇల్లెందులో మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల లోపే చట్టబద్ధత కల్పించాలని కోరారు.

సింగరేణి(కొత్తగూడెం): సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని, సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఆంతోటి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు.

వైద్య పరీక్షలు

జూలూరుపాడు: పడమటనర్సాపురం గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. సీహెచ్ఓ రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

పాఠశాలల బంద్‌ను విజయవంతం చేయండి..

సింగరేణి(కొత్తగూడెం): ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలపై రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ శనివారం ప్రభుత్వ పాఠశాలల బంద్‌ను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి గణేష్ శుక్రవారం ఒక ప్రకటన తెలిపారు.

పాల్వంచరూరల్: పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాలకు చార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తూ నేడు తలపెట్టిన పాఠశాలల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకుడు అఖిల్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

సీపీఎం కార్యవర్గం ఎన్నిక

సింగరేణి(కొత్తగూడెం): సీపీఎం టౌన్ కార్యదర్శిగా లిక్కి బాలరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం ప్రగతినగర్‌లో జరిగిన మహాసభలో ఆయనను ఎన్నుకున్నారు. అదేవిదంగా కార్యదర్శి వర్గ సభ్యులుగా భుక్యా రమేష్, డి.రమేష్, ఎస్ లక్ష్మి, నందిపాటి రమేష్ ఎన్నికయ్యారు.

ఆకస్మిక తనిఖీ

జూలూరుపాడు: పాపకొల్లు గ్రామంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిని డీఎంహెచ్ఓ కార్యాలయ ఆఫీసర్ ఫయాజుద్దీన్, సూపర్‌వైజర్ హరి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామీణ వైద్యుడి ధ్రువపత్రాలు, మందులను పరిశీలించారు. ఫయాజుద్దీన్ మాట్లాడుతూ.. డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు తనిఖీ చేస్తున్నట్లు, ఆర్ఎంపీలు ఇష్టానుసారంగా ప్రజలకు వైద్యం చేయరాదన్నారు.

ముమ్మరంగా వరికోతలు

- కూలీల కొరతను అధిగమిస్తున్న యంత్రాలు
- పెరిగిన పంట దిగుబడి
- ఆనందంలో అన్నదాతలు



వరి నూర్పిడి చేస్తున్న హార్వెస్టర్

జూలూరుపాడు: వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌ల కింద ఆయకట్టు భూములు, వ్యవసాయ బోర్ల కింద వానాకాలంలో వరి పంట సాగయింది. కూలీల కొరత కారణంగా రైతులు హార్వెస్టర్ యంత్రాలతో వరి కోతలు చేట్టారు. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురవడంతో చెరువులు, కుంటలు, చెక్ డ్యామ్‌ల్లో నీటి సామర్థ్యం పెరగడంతోపాటు, వాతావరణం వరి పంటకు అనుకూలంగా ఉంది. పెద్దగా తెగుళ్లు ఆశించకపోవడంతో దిగుబడి గత ఏడాది కంటే పెరిగింది. వ్యవసాయశాఖ అంచనా ప్రకారం ఈ ఏడాది మండలంలో 3,650 ఎకరాల విస్తీర్ణంలో వరి పంటను రైతులు సాగు చేయగా గత ఏడాది 3,400 ఎకరాల్లో సాగు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న రకానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించడంతో రైతులు అత్యధిక విస్తీర్ణంలో సాగు చేశారు. ఈ ఏడాది సన్నం రకం ఎకరానికి 30–35 క్వింటాళ్లు, ముదుగులు(మొద్దులు) ఎకరానికి 35–40 క్వింటాళ్ల దిగుబడి వస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. టైర్ వీల్ వరి కోత యంత్రాలకు గంటకు రూ.2,200 నుంచి రూ.2,800, చైన్ యంత్రాలకు అయితే గంటకు రూ.3,500 – రూ.3,800 చెల్లిస్తున్నట్లు రైతులు చెపుతున్నారు. ప్రస్తుతం కూలీల కొరత కారణంగా యంత్రాలతో కోయించాల్సి వస్తోందంటున్నారు. అయితే అక్కడక్కడ రైతులు కూలీలతో కూడా వరి పంటను కోయిస్తున్నారు. ఒకవైపు కోతలు కోయించడంతోపాటు, నూర్పిడి చేయడం, ధాన్యాన్ని ఆరబెట్టడం వంటి పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు.

వరి కోతలు ముమ్మరంగా సాగుతుండటంతో దళారుల బెడద లేకుండా నేరుగా వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు జూలూరుపాడు సహకార సంఘం ఆధ్వర్యంలో పాపకొల్లు, జూలూరుపాడు, కాకర్ల, పడమటనర్సాపురం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. దీంతో రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ రకానికి క్వింటాకు రూ.2,320, సీ గ్రేడ్ రకానికి రూ.2.300 చెల్లిస్తుండటంతోపాటు, క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తుండటంతో రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్మేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. మరోవైపు మిల్లర్లు, వ్యాపారులు ఆరబెట్టని ధాన్యాన్ని కల్లాల్లోనే నిబంధనలు లేకుండానే రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు.

జాగ్రత్తలు పాటించాలి...

పండించిన పంటను సకాలంలో నూర్పిడి చేసి సరైన పద్ధతిలో ఆరబెట్టి నిల్వ చేయడం ద్వారా రైతులు తమ కష్టానికి తగ్గ ఫలితం పొందవచ్చు. వరి చేను పండుబారిన తరువాత కోతకు రెండు



కాకర్లలోని కల్లంలో ఆరబెట్టిన ధాన్యం

వారాల ముందే నీటి తడులను నిలిపివేయాలి. మంచు కురిసే సమయంలో కోస్తే గింజలు మెత్తబడి ధాన్యం రంగు మారే అవకాశం ఉంది. ఈ దశలో 18–20 శాతం తేమ ఉంటుంది. హార్వెస్టర్‌తో కోస్తే వెంటనే కల్లంలో ఆరబోయాలి. కల్లంలో ఆరబోసిన ధాన్యం మంచుకు తడవకుండా కుప్ప చేసి పట్టాలు కప్పాలి. ఆరబోసిన ధాన్యం 5–7 రోజులు ఎండబెట్టాలి. తేమ శాతం 17 శాతం కంటే తక్కువ ఉండేలా చూసుకోవాలి. నూర్పిడి తరువాత పరిశుభ్రంగా తూర్పార బోసి చెత్త, మట్టి వంటి వాటిని వేరు చేయాలి.

కూలీల కొరత ఉంది..



కూలీల కొరతతో యంత్రాలతో వరి కోయిస్తున్నాం. గంటకు రూ. 2,200. ఎకరానికి 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఎకరానికి రూ.35 వేలు పెట్టుబడి పెట్టాం.

– కిలారి వీరస్వామి, రైతు, జూలూరుపాడు

దిగుబడి పెరిగింది...



ఈ ఏడాది వరి పంట దిగుబడి పెరిగింది. గత ఏడాది ఎకరానికి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తే ఈ ఏడాది 35 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. 10 ఎకరాల్లో వరి పంట సాగు చేసినం. ప్రభుత్వం రూ.500 బోనస్ ఇవ్వడం సంతోషంగా ఉంది.

– నాగరాజు, రైతు, జడలచింత

పది ఎకరాల్లో సాగు చేశాం..



పది ఎకరాల్లో హార్వెస్టర్‌తో వరి కోత కోయించినం. ఎకరానికి 35 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. గతేడాది కంటే ఈ ఏడాది దిగుబడి పెరిగింది. వరి పంటకు వాతావరణం కూడా అనుకూలంగా ఉంది.

– చావా సురేష్, రైతు, కాకర్ల

కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలి..



ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలి. ఏ గ్రేడ్ రకం క్వింటాకు రూ. 2,320, సీ గ్రేడ్ రకానికి రూ. 2,300 మద్దతు ధర చెల్లిస్తున్నారు. సన్న రకానికి రూ.500 బోనస్ కూడా ఉంది.

– దీపక్ ఆనంద్, ఏఓ, జూలూరుపాడు

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి..



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పాల్వంచ: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పట్టణ ఎస్ఐ సుమన్ అన్నారు. పట్టణ పరిధిలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు శుక్రవారం సేఫ్ ఇండియా అంశంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్ల కార్డులు పట్టుకుని, వాహనదారులను చైతన్య పరుస్తూ హెల్మెట్ ధరించాలలని, ధరించని వారికి పుష్పాలు అందించి బాధ్యతను గుర్తుచేశారు. ఎస్ఐ మాట్లాడుతూ.. వాహనాలు నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమ్య, డీన్ మధు, నాగబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యాంటీన్ ప్రారంభం



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న డీవీ

ఇల్లెందు: మున్సిపల్ ఆవరణలో డ్వాక్రా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కమిషనర్ శ్రీకాంత్ శుక్రవారం ప్రారంభించారు. మున్సిపల్ మేనేజర్ అంకుషావలీ, అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, టీపీఓ సతీష్, కౌన్సిలర్లు, డ్వాక్రా సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ పాటిల్

పాల్వంచ: ఇటీవల జరిగిన స్కూల్ ఆఫ్ గేమ్ ఫెడరేషన్ పోటీల్లో అండర్ 17 బాలుర విభాగంలో పాల్వంచకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. శ్రీ విద్య పాఠశాలకు చెందిన నోయల్ జాతీయ స్థాయి పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించాడు. జూడో, నెట్, బాల్ బ్యాడ్మింటెన్, హ్యాండ్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించాడు. అండర్ 14 బాలికల విభాగంలో గరిడపల్లి భావన కీర్తిక, నవభారత్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రోడా గ్రేస్ బ్యాడ్మింటెన్, ఫెన్సింగ్, జూడో విభాగాల్లో ప్రతిభ కనబర్చారు. వీరిని శుక్రవారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అభినందించారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ పరంధామరెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు జి.యుగంధర్‌రెడ్డి, వై.వెంకటేశ్వర్లు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నరేష్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమస్యల సాధనకు ఉద్యమిస్తాం..



మాట్లాడుతున్న శంకర్

సింగరేణి(కొత్తగూడెం): కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా స్ట్రక్చర్ సమావేశం ఉందని, కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతనాలు ఇప్పిస్తామని, మరెన్నో సదుపాయాలపై సమావేశంలో మాట్లాడుతామని ప్రగల్భాలు పలికిన ఏఐటీయూసీ నాయకులు ఏమీ మాట్లాడకుండా.. ఇస్తున్న క్యాంటిన్ సదుపాయం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడు రాసూరి శంకర్ ఆరోపించారు. శుక్రవారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్‌లోని సివిల్, సివిక్, వాటర్ సప్లయ్ కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు సంవత్సరాల నుంచి ఎంతో ఉత్కంఠంగా ఎదురు చూస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల హైపవర్ వేతనాల గురించి మాట్లాడి ఇప్పిస్తామని చెప్పిన నాయకులు తోక జాడించారన్నారు. గెలిచిన యూనియన్, ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు సంస్థలో పనిచేస్తున్న సుమారు 32 వేల మంది కాంట్రాక్ట్ కార్మికుల భవిష్యత్ గురించి చర్చించకపోవటం విచార కరమన్నారు. ఎవరో వస్తారు.. ఏదో చేస్తారు.. అనే సిద్ధాంతాన్ని పక్కన పెట్టి తామే కలిసి కట్టుగా కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల సాధన కోసం ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మేడిపల్లి కరుణాకర్, గూడెల్లి యాకయ్య, అనిల్, బాషబోయిన రవికుమార్, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

దళితుల అభివృద్ధిపై దృష్టి సారించండి..



ఉపేందర్‌ను సన్మానిస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: దళితుల అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలని షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్ అన్నారు. షెడ్యూల్డ్ కులాల జిల్లా కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉపేందర్‌ను శుక్రవారం సమితి సభ్యులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. జిల్లాలో దళిత వాడలపై ప్రత్యేక దృష్టి పెట్టి విద్య, ఉద్యోగం, ఉపాధి,"సంక్షేమం, అభివృద్ధి దిశగా ప్రభుత్వ కృషితో చేయాలని కోరారు. పాలనా సౌలభ్యం కోసం ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాల అభివృద్ధి అంధకారంలో నెట్టివేయబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో దళిత బంధు పథకం పేరుతో దళితులను నిరాశకు గురి చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడిచినా సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లేకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో గోర్ల మోహన్‌రావు, దాసరి యాకయ్య," ఎలిగంటి కొమరయ్య, కొత్తపల్లి శ్రీనివాస్, ఎనగంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మండలస్థాయి గణిత టాలెంట్ టెస్ట్



జూలూరుపాడు: ప్రశ్నపత్రాలు విడుదల చేస్తున్న ఎంఈఓ జుంకీలాల్, హెచ్ఎం లక్ష్మీనర్సయ్య

జూలూరుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం తెలంగాణ గణిత ఫోరం (టీఎంఎఫ్) ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు గణిత టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి బానోత్ జుంకీలాల్, జూలూరుపాడు హైస్కూల్ హెచ్ఎం లక్ష్మీనర్సయ్య ప్రశ్నపత్రాలను విడుదల చేశారు. పాపకొల్లు, జూలూరుపాడు, గుండెపుడి, కాకర్ల, పడమటనర్సాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులతోపాటు, జూలూరుపాడు కేజీబీవీ, పడమటనర్సాపురం ఏజీహెచ్ఎస్ విద్యార్థినులు మొత్తం 56 మంది హాజరయ్యారు. ఇందులో ప్రతిభ చూపిన వారు డిసెంబర్ 11న కొత్తగూడెంలో జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌కు హాజరు కానున్నారు. కార్యక్రమంలో టీఎంఎఫ్ మండల అధ్యక్షుడు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, జిల్లా ట్రెజరర్ లింగయ్య, గణిత ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, పురుషోత్తం, వెంకటేశ్వరరావు, రమేష్‌పాల్గొన్నారు.

టేకులపల్లి: తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని జీహెచ్ఎస్ పాఠశాలలో మండల స్థాయిలో గణిత టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో వి.శ్రీహరిణి ప్రథమ, నీరజ్ ద్వితీయ, అక్షిత్ తృతీయ, తెలుగు మీడియంలో వికాస్ ప్రథమ స్థానాల్లో నిలిచారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.

ఏఎస్సై బదిలీ

జూలూరుపాడు: జూలూరుపాడు ఏఎస్సై బి.తిరుపతిరావు ఖమ్మం పోలీస్ కమిషనరేట్‌కు బదిలీ అయ్యారు. మూడున్నరేళ్లుగా ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఆయన ఇటీవల రాష్ట్రస్థాయి ఉత్తమ విచారణ అధికారి(బెస్ట్ ఎంక్వైరీ ఆఫీసర్)గా డీజీపీ జితేందర్ నుంచి అవార్డు అందుకున్నారు. కాగా, శుక్రవారం రిలీవ్ అయిన తిరుపతిరావును పోలీసు ఉద్యోగులు సన్మానించారు.

రేపు భగవద్గీత కంఠస్థ పోటీలు

కొత్తగూడెంఅర్బన్: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గీతా జయంతి సందర్భంగా ఆదివారం భగవద్గీత 5వ అధ్యాయంలో జిల్లా స్థాయి కంఠస్థ పోటీలు నిర్వహించడం జరుగుతుందని పరిషత్ జిల్లా అధ్యక్షులు వందనపు శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు భజన మందిరం రోడ్డులోని వివేకానంద విద్యాలయంలో జరుగుతాయని పేర్కొన్నారు. విజేతలు జిల్లా స్థాయి పోటీలో పాల్గొంటారని, ఆ తరువాత రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

పరామర్శ

ఇల్లెందు: ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే ఊకె అబ్బయ్య ఇటీవల మరణించారు. ఈ మేరకు శుక్రవారం వారి కుటుంబ సభ్యులను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పరామర్శించారు.

చర్యలు తీసుకోవాలి

పాల్వంచ: విద్యార్థులతో గోనె సంచులు, ఇతర పనులు చేయిస్తున్న ఆశ్రమ బాలికల గిరిజన హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కాంపాటి పృథ్వీ, జిల్లా నాయకులు మునిగెల శివ ప్రశాంత్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సమయంలో విద్యార్థులు బయటి తినుబండారాలు ఉన్న సంచులు మోస్తుండటంతో ఆందోళన వ్యక్తం చేశారు. మాట్లాడుతూ... ఇప్పటికే పలుచోట్ల విద్యార్థులు ఫుడ్ పాయిజన్ అయి మృతి చెందుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నా అధికారుల తీరు మారలేదన్నారు. స్టోర్ రూం, వంట రూంలు శుభ్రంగా ఉంచాలని, జిల్లా, మండల అధికారులు తరచు హాస్టళ్లను విజిట్ చేసి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కోరారు.

ఓటు హక్కు కల్పించండి..

టేకులపల్లి: వచ్చే సంవత్సరం జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రాథమిక పాఠశాలలోని ఎస్జీటీ ఉపాధ్యాయులకు కూడా ఓటు హక్కును కల్పించాలని టీఎస్‌టీటీఎఫ్ టేకులపల్లి మండల అధ్యక్షుడు బి.ఫూల్‌సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులతో సమానమైన అర్హతలు కలిగి ఉన్న ప్రాథమిక ఉపాధ్యాయులకు ఓటు హక్కు లేకపోవడం వలన ప్రాథమిక పాఠశాలల సమస్యలు మండలిలో చర్చించే అవకాశం లేకుండా పోయిందని, ఎన్నికల సంఘం, ప్రభుత్వం ఆలోచించి ఓటు హక్కు కల్పించాలని కోరారు.

ఆర్థిక సాయం

ఇల్లెందు: తెలంగాణ ఉద్యమకారుడు పట్టణంలోని సబ్‌జైలు బస్తీకి చెందిన రమేష్ కుటుంబానికి సహచర కేబుల్ ఆపరేటర్లు శుక్రవారం రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. ఇటీవల రమేష్ మృతి చెందగా నెల రోజుల క్రితం ఆయన సతీమణి కూడా మృతి చెందింది. ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు.

ఆహ్లాదం, ఆనందంతో అందరికీ ఆరోగ్యం

టేకులపల్లి: ఆనందం, ఆహ్లాదంతోనే అందరికీ ఆరోగ్యం లభిస్తుందని ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం టేకులపల్లి సింగరేణి కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చిల్డ్రన్స్ పార్క్ (ఆనంద వనం), సీఈఆర్ క్లబ్, షటిల్ కోర్ట్‌లను ఆయన ప్రారంభించారు. మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతకు ఎంత ప్రాధాన్యం ఇస్తుందో ఉద్యోగుల సంక్షేమానికి అంతే ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఫ్యామిలీ డే సందర్భంగా నిర్వహించిన క్రీడలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈనెల 30న ఉద్యోగ విరమణ పొందుతున్న జీఎంను సీఈఆర్ క్లబ్ కమిటీ సభ్యులు సన్మానించారు. డీజీఎం పర్సనల్ జీవి మోహన్రావు, ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవిందరావు, మేనేజర్ సౌరబ్ సుమన్, ప్రాజెక్ట్ ఇంజనీర్ శివశంకర్, గుర్తింపు సంఘం ఉపాధ్యక్షులు రాజారామ్, ప్రాతి నిధ్య సంఘం ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ



చుంచుపల్లి: క్రీడా సామగ్రిని అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

చుంచుపల్లి: బాబూక్యాంప్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బూరుగు నీరజ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జోన్ చైర్మన్ లయన్ మన్నెం జవహర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. మైదానంలో ప్రతీరోజు ఒక గంట సమయం క్రీడలకు కేటాయించాలన్నారు. మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉన్నవారే చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తారని చెప్పారు. దేశ విదేశాల్లో క్రీడా రంగంలో అత్యున్నత స్థాయికి వెళ్లిన వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. క్రీడా సామగ్రి వితరణ దాత లయన్ మదన్ మోహన్‌రావు, సభ్యులు షేక్ దస్తగిరి, కార్యదర్శి లగడపాటి రమేష్, మొరిశెట్టి మోహనరావు, శ్రీధర్‌రావు, బిక్కులాల్, కోటేశ్వరరావు, బుచ్చయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాల్వంచ: పట్టణంలోని ఆశ్రమ గిరిజన పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ పాల్వంచ గోల్డ్ ఆధ్వర్యంలో ఆట వస్తువులు వితరణగా అందజేశారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ రేపాల మదన్ మోహన్ ఆధ్వర్యంలో సీనియర్ క్లబ్ ప్రతినిధి ఎడవల్లి కృష్ణ అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పోట్రు సతీష్, కార్యదర్శి మాడిశెట్టి రాజమనోహర్, గ్లోబల్ సర్వీస్ కన్వీనర్ ఆరుద్ర సత్యనారాయణ, శ్రీనివాస్, దస్తగిరి, జవహర్‌రెడ్డి పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి దినేష్

టేకులపల్లి: డిసెంబర్ 2 – 15 వరకు కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే ఉంటుందని టేకులపల్లి మండల వైద్యాధికారి కందుల దినేష్ తెలిపారు. జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సులానగర్ పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మాట్లాడుతూ... కుష్ఠు వ్యాధి లక్షణాలు... చర్మంపై రాగి రంగు, ఎర్రటి గోధుమ వర్ణపు మచ్చలు, కాళ్లు, చేతులు తిమ్మిర్లు, మొద్దు బారి స్పర్శ లేకుండా ఉండడం ఉంటాయని తెలిపారు. కుష్ఠి వ్యాధిని సరైన సమయంలో గుర్తించకపోతే ఆ వ్యక్తికి అంగవైకల్యం రావడంతో పాటు ఆరోగ్య వంతులకు సోకే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి ఈ వ్యాధిపై అవగాహన పెంచుకొని ఈ వ్యాధిని నిర్మూలించడంలో అందరూ సహకరించాలని కోరారు. వైద్య సిబ్బంది ప్రతీరోజు ఉదయం 6 గంటల నుంచి 9 వరకు 20 ఇళ్లను సందర్శించి వ్యాధి లక్షణాలు ఉంటే వారిని గుర్తించి తగిన పరీక్షలు చేసి వారికి మందులు ఇప్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ గన్యా, ఆరోగ్య విస్తరణ అధికారి దేవా పాల్గొన్నారు.

కూలీల సమస్యలు పరిష్కరించండి..



జూలూరుపాడు: ధర్నా చేస్తున్న నాయకులు

జూలూరుపాడు/సుజాతనగర్: వ్యవసాయ కూలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఏఐపీకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బానోత్ ధర్మా మాట్లాడుతూ... కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రజలకు 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, కానీ హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12,000 జీవన భృతి అందించాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో ఏఐపీకేఎంఎస్ కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి కంగాల వెంకటమ్మ, టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి వై.గోపాల్‌రావు, కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు రాలయ సిద్ధు పాల్గొన్నారు.

భోజన కార్మికుల ఆధ్వర్యంలో...

ఇల్లెందురూరల్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈఓ స్వామికి అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సుల్తానా, సీఐటీయూ నాయకులు అబ్దుల్ నబీ, తాళ్లేరి కృష్ణ, భోజన వర్కర్లు కుమారి, బుర్రి పద్మ, రాణి, జయ, కౌసల్య, రాములమ్మ, స్వరూప, సరస్వతి, లీల, సుజాత తదితరులు పాల్గొన్నారు.